# అతిథి!

"ఎక్కణ్ణుంచిరా ఉత్తరం? హైదరాబాదు నుంచేనా?'' ప్రశ్నించడంతో పాటు జవాబు కూడా తనే చెబుతూ వచ్చి ఎదురుగా కూర్చున్నాడు ప్రకాశం.

నా చిన్ననాటి మిత్రులందరూ చెట్టుకొకరూ పుట్టకొకరై వెళ్ళిపోగా చివరికి మిగిలింది వాడికి నేను, నాకు వాడూనూ!

రోజుకు కనీసం ఒక్కసారైనా కలుసుకోకుండా ఉండలేము మేము. ఇద్దరి ఇళ్ళూ ఒకే వీధిలో ఉండడం వల్ల కూడా మేమలా తరచుగా కలుసుకుంటున్నామేమో తెలీదు గ్గానీ గత నలభై ఏళ్ళుగా మా స్నేహం ఇలా కొనసాగుతూనే ఉంది.



-తోటి శంకర్‌రావు

"ఇంకెక్కణ్ణుంచి వస్తుందిరా నాకు ఉత్తరం? హైదరాబాదు నుంచే...'' అంతవరకూ చదువుతున్న ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకుంటూ అన్నాను.

"ఎవరు రాశారు? పెద్దాడా, చిన్నాడా?'' అడిగాడు ప్రకాశం.

"ఇద్దరూ కలిసే రాసినట్టున్నారు. ఇద్దరి సమస్యలూ రిఫ్లెక్ట్ అయ్యాయి ఇందులో...'' నవ్వుతూ అన్నాన్నేను.

"అసలు సిసలైన దాయాదులంటే నీ పుత్ర రత్నాలేరా! చివరికి ముప్పావలా ఉత్తరం ముక్కను కూడా చెరిసగం పంచుకున్నారు...'' పగలబడి నవ్వుతూ అన్నాడు ప్రకాశం.

నా మనస్సెందుకో చివుక్కుమంది.

అనంకల్పితంగా చేసిన ఓ చిన్న పొరపాటును ఎనలైజ్ చేస్తూ వాడలా కామెంట్ చెయ్యడం నాకెంత మాత్రం నచ్చలేదు. అయినా అది పొరపాటని కూడా ఎందుకు అనుకోవాలి. పెద్దాడు ఉత్తరం రాస్తున్న సమయానికి యాదృచ్ఛికంగా చిన్నాడు అక్కడికెళ్ళి ఉంటాడు. అన్నయ్యతో పాటు తనూ ఓ రెండు ముక్కలు రాసి ఉంటాడు.

ఆ మాటే అన్నాను ప్రకాశంతో.

వాడు మరోసారి నవ్వి... "కన్నవాడివి నువ్వు డిఫెండ్ చేసుకోకపోతే ఇంకెవరు చేసుకుంటారు గానీ... ఇంతకూ ఏమంటారు? ఇల్లు బేరం పెట్టి ఇక్కడికొచ్చెయ్యమంటూ మళ్ళీ పాతపాటే పాడుతున్నారా? లేక ఈసారి తాళం మారిందా?''

ఈ ప్రకాశంగాడితో వచ్చిన చిక్కే ఇది. మనం అడిగినా అడక్కపోయినా కుండబద్దలు కొట్టినట్టు చెబుతాడు తన అభిప్రాయాన్ని. "ఈ వివరాలేవీ ప్రకాశం బాబాయ్‌తో డిస్కస్ చెయ్యొద్దంటూ'' పెద్దాడు చేసిన వార్నింగ్‌లో తప్పేమీ లేదు. అసలీ ఉత్తరాన్ని గురించి ఇంత డీటేయిల్‌గా వాడికి చెప్పడం నాదీ బుద్ధి తక్కువ.

"బెల్లం కొట్టిన రాయిలా అలా మాట్లాడవేమిట్రా? నాతోగానీ చెప్పొద్దని రాశాడా ఏం నీ జ్యేష్ఠపుత్రుడు?''

వీడి దగ్గర ఏ విషయమూ దాచిపెట్టలేనని మరోసారి ప్రూవ్ అయిపోయింది. ఈ వెధవలకు ఫేస్ రీడింగ్ బాగా చేతనవును. కడుపులో దాచుకున్న విషయాలన్నీ ఖచ్చితంగా చెప్పేస్తాడు.

"వాడు రాసినా రాయకపోయినా నువ్వు మాత్రం బ్రహ్మాండంగా ఊహించుకుంటున్నావ్‌గా'' అంటూ ఓ చురక తగిలించి...'' అయినా వాళ్ళు అన్నదాంట్లో మాత్రం తప్పేముందిరా? ఇన్నాళ్ళూ ఉద్యోగం ఉందన్న మిషతో ఒంటరిగా ఏడ్చాను. ఇప్పుడు ఆ ముచ్చటా తీరిపోయిందిగా. నిజం చెప్పాలంటే వాళ్ళన్నదే కరెక్టు. ఇల్లూ వాకిలీ అమ్మేసి హాయిగా వాళ్ళ దగ్గరే ఉంటాను. ఇంకెన్నేళ్ళు బ్రతుకుతానని, మహా అయితే అయిదో పదో...''

ప్రకాశం నన్నే పరీక్షగా చూశాడు. ఈ మాటలు నేను మనస్పూర్తిగా అంటున్నదీ లేనిదీ నిర్ధారించుకుంటున్నట్టున్నాడు.

"నిజంరా ప్రకాశం. నాకీ ఒంటరి జీవితంతో విసుగెత్తిపోతోంది. పొద్దున్నే లేచి అయ్యరు హోటల్లో కాఫీ తాగడం, మధ్యాహ్నం ఏ మెస్సులోనో పడి నాలుగు మెతుకులు గతకడం, పొద్దంతా ఊరిమీద బలాదూరు తిరగడం... రాత్రి మళ్ళీ ఎక్కడికో వెళ్ళి కడుపు నింపుకోవడం... ఒక్కోసారి ఆలోచిస్తుంటే నేను కేవలం తినడానికే జీవిస్తున్నానేమోననిపిస్తుంది...'' భారంగా నిట్టూర్చాను.

"అంత విసుగ్గా ఉంటే ఏ విధవరాలినో లేకపోతే ఏ విడాకులు తీసుకున్న దాన్నో చూసి పెళ్ళి చేసుకోరాదూ?'' వాడి కళ్ళు నవ్వుతున్నాయి. వళ్ళుడిపోయిన

బోసినోరూ నవ్వుతోంది.

"ఏడిశావ్. ఈ వయస్సులో పెళ్ళి చేసుకోవడానికి నేనేమైనా మహానాయకుణ్ణా, మహానటుణ్ణా?" నాకూ నవ్వొచ్చింది.

"నా ఉద్దేశ్యం కూడా అదే నాన్నా! ఇంటికి ధర నిర్ణయించడంలో బాబాయ్ పూర్తిగ్గా ఫెయిల్ అయ్యాడు. లక్షాపాతిక వేలడిగినా కళ్ళకద్దుకుని తీసుకునే ఇంటికి తొంభైవేలే చాలనుకోవడం బాబాయ్ అతి మంచితనం. అందుకే నేనా రేటుకు యాక్సెప్ట్ అవ్వడం లేదు" అని తండ్రితో చెప్పి నావైపు చూశాడు సుధాకర్.. "లక్షా ఇరవై వేలకు ఒకపైసా తక్కువడిగినా నేను మీ ఇల్లు కొనబోవడం లేదు బాబాయ్. తరువాత మీ ఇష్టం..." అన్నాడు సీరియస్‌గా.

ఆ క్షణంలో అతని వ్యక్తిత్వం ఎవరెస్టు శిఖరమంత ఎత్తుకు ఎదిగినట్టు అనిపించింది. నాకు.

అన్న మాట ప్రకారం వారం రోజుల్లోనే ఇరవై అయిదు వేలు తెచ్చిచ్చాడు సుధాకర్. రశీదు ఇస్తానన్నా వినకుండా వెళ్లిపోయాడు.

ఎందుకో తెలీదుగానీ, సుధాకర్ అడ్వాన్స్ చెల్లించి వెళ్ళిన మరుక్షణమే ఆ ఇల్లిక నాది కాదన్న ఫీలింగ్ మనస్సును పిండేసింది.

పిత్రార్జితమైన స్థిరాస్థిని అభివృద్ధి చెయ్యడం అటుంచి ఉన్నదాన్నే తెగనమ్మి వెళుతున్నందుకు బాధగానే ఉన్నా మర్నాడే సామానంత సర్దేసుకొని ఇంటికి తాళం వేసి తాళం చెవి ప్రకాశానికిచ్చి హైదరాబాద్‌కు బయల్దేరాను.

సామానంటే పెద్దగా ఏమీ లేదు. ఓ మడతమంచం, కొన్ని పాత్రలు, వరుచుకునే బట్టలు, నాలుగు జతల బట్టలు అంతే!

అరుంధతి పోయిన సంవత్సరమే విలువైన వస్తువులన్నీ చెరిసగం పంచుకుని తీసుకుపోయారు. మా వాళ్ళు. నేనూ ఒంటరిగాడినే కాబట్టి, తిండీ తిప్పలూ కూడా బయటే కాబట్టి ఎక్కువ సామాను ఉంచుకోలేదు. అదే నా పాలిట వరమయ్యింది. రెండే రెండు సూట్‌కేసుల్లో సామానంతా అడ్జస్టయిపోయింది.

సికింద్రాబాదు స్టేషన్లో రైలు దిగి, ట్రాఫిక్ పోలీసు సాయంతో మీటర్ రేటుకే ఆటో మాట్లాడుకుని తిన్నగా పెద్దాడి దగ్గరికి బయల్దేరాను.

తట్టా బుట్టాతో దిగిన నన్నుచూసి మా పెద్ద కోడలు రమ్య ఆశ్చర్యపోయినట్టుంది. పిల్లలకు కూడా నమ్మకం కుదిరినట్టు లేదు.

"మళ్ళీ మీ ఊరికి వెళ్ళిపోవుగా తాతయ్యా" అని అడిగి కన్‌ఫర్మ్ చేసుకుని మరీ చిందులేసారు.

"అక్కడ ఇల్లమ్మేసారా మామయ్యా?" కాఫీకప్పుతో వచ్చిన రమ్య అడిగింది అనుమానంగా.

"అవునమ్మా.. మీకెవ్వరికీ ఉపయోగపడనప్పుడు నాకు మాత్రం ఎందుకని అమ్మేసి వచ్చాను..." నా గొంతులో పలికిన విషాదం రమ్యను కూడా కదిలించినట్టుటుంది.

"ఇల్లు అమ్మమని బలవంత పెట్టినందుకు మమ్మల్ని క్షమించండి మామయ్యా. ఇక్కడ అప్పుల బాధలు పడలేక మీ మనసు నొప్పించాల్సి వచ్చింది. అయినా ఈ వయసులో మీరు మాత్రం ఎన్నేళ్లని వంటరిగా ఉంటారు అక్కడ" అన్నది ఎంతో అనునయంగా.

రమ్య మాటలు కొంతలో కొంత సంతోషాన్ని కలిగించాయి.

## శ్రద్ధ

"రాముకు చదువు అంటే ఎంత శ్రద్ధ!" ఆశ్చర్యంగా అన్నాడు కుమార్.

"ఎలా చెప్పగలవ్?" అడిగాడు సతీష్.

"రేపు పరీక్ష అయితే ఇవాళ సినిమాకు వచ్చి ఇంటర్వెల్‌లో చదువుకోవటానికి తన వెంట పుస్తకం తెచ్చుకున్నాడు మరి!" చెప్పాడు కుమార్.

శ్రీనివాసరావు
[ఫిరంగిపురం]

వేణ్ణీళ్లతో స్నానం చేసి బడలిక తీర్చుకొని చక్కటి వంటకాలతో భోజనం చేసి పిల్లలతో కాస్సేపు ఆడుకుని అలసటగా నడుం వాల్చాను.

"తాతయ్యా..! నాన్నగారు, బాబాయ్ వచ్చారు లే తాతయ్యా.." అంటూ పిల్లలొచ్చి లేపేవరకూ నాకసలు మెలకువే రాలేదు.

"మీరొస్తున్నట్టు ఓ ఉత్తరం ముక్కరాస్తే స్టేషన్‌కు వచ్చేవాళ్లంగా నాన్నా! ఆటో వాడేమీ ఇబ్బంది పెట్టలేదుగా..?" వాళ్ళిద్దరి మొహాలూ దివ్యంగా వెలిగిపోతున్నాయ్.

అప్పుడనిపించింది. ఇల్లమ్మేసి మంచిపనే చేసానని!

"మిమ్మల్ని అనవసరంగా ఇబ్బంది పెట్టడం ఎందుకని రాయలేదు. గానీ ఏమిటంత ఉత్సాహంగా కనిపిస్తున్నారు...? కొంపతీసి రమ్యగానీ ఏమైనా చెప్పిందా ఏమిటి?"

"మధ్యాహ్నామే ఫోన్ చేసి చెప్పింది నాన్నా. అందుకే వన్ అవర్ పర్మిషన్ తీసుకుని తమ్ముడి ఆఫీసుకెళ్ళి వాణ్ణి కూడా వెంటపెట్టుకొచ్చాను.. అన్నట్టు స్వీట్స్ కూడా తెచ్చాను..." అన్నాడు పెద్దాడు.

ఇంతలో స్వీట్ ప్యాకెట్ పట్టుకొని పరుగున వచ్చారు పిల్లలు. అందరికీ తలా ఒకటి చొప్పున పంచి మిగతావి ఇద్దరూ కలిసి జాతీయం చేసుకున్నారు.. ఏ గొడవా లేకుండా!

"ఎంతకమ్మారు నాన్నా? ధర బాగానే పలికిందా?" అడిగాడు చిన్నాడు.

"మార్కెటు రేటు ఎంతుందో తెలీదుగానీ.. నేను అడిగిన దానికంటే ముప్పైవేలు ఎక్కువ చేసుకొని కొన్నాడ్రా సుధాకర్.. అడ్వాన్స్‌గా ఇరవై అయిదు వేలిచ్చాడు. మిగతా డబ్బు రెండు నెలల్లో ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుంటానన్నాడు..."

ఎందుకో తెలీదుగానీ నేనాశించినంత ఎగ్జైట్‌మెంట్ కనిపించలేదు వాళ్ళలో! పెద్దాడు మాత్రం.. "ప్రకాశం బాబాయ్ కొన్నాడా?" అనడిగాడు ముభావంగా.

"అవున్రా..నేను తొంభైవేలడిగితే సుధాకర్ లక్షా ఇరవై వేలకు సెటిల్ చేశాడు..."అన్నాను ఉత్సాహంగా.

వాళ్ళిదేమీ వినిపించుకునే స్థితిలో లేరు. సుధాకర్‌కు ఇల్లమ్మి నేను పొరపాటు చేసినట్టే భావిస్తున్నారు అందరూ. పైకి ఏమీ అనకపోయినా వీళ్ళందరి అభిప్రాయం అదేనని స్పష్టంగా తెలుస్తోంది.

రాత్రి భోజనాల దగ్గర రమ్య అన్నది. "ఇంకా నలుగు రైదుగురికి చెప్పి చూడాల్సింది మామయ్యా" అని.

"వంద మందికి చెప్పినా ఆ పాతింటికి అంతకు మించి ఎవరూ పెట్టలేరమ్మా..." అన్నాను విసుగ్గా. ఎవ్వరూ కిక్కురుమనలేదు.

వెళుతూ వెళుతూ "అక్కడికి ఎప్పుడొస్తున్నారు నాన్నా?" అనడిగేడు చిన్నాడు.

"రెండ్రోజులు ఆగి వస్తాను బాబూ. నాకూ చంటిదాన్ని చూడాలనే ఉంది... ఇప్పుడది గోడలు పట్టుకొని నడవడానికి ట్రై చేస్తుందటగదా... పిల్లలు చెప్పారు...." అన్నాను.

"అవును నాన్నా... ఇప్పుడిప్పుడే రెండు మూడు అడుగులు వేస్తోంది...." అని మరి కాస్సేపు కూర్చుని మాట్లాడి బస్సుకు టైమైపోతుందంటూ వెళ్ళిపోయాడు చిన్నాడు.

దాదాపు పదేళ్ళ తరువాత మళ్ళీ ఆత్మీయుల మధ్య పడడంతో నాలుగు నెల్లు ఎలా గడిచాయో నాకసలు తెలీనేలేదు. కొన్నాళ్ళు ఇక్కడా కొన్నాళ్ళు అక్కడా ఉంటూ మొత్తానికి దినమొక క్షణంలా గడిపాను.

ఈ లోగా మిగతా తొంభై అయిదు వేలు చెల్లించి ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకొన్నాడు సుధాకర్. నేను ఎంత వద్దంటున్నా వినకుండా మా ముగ్గురికీ రానుపోను ఛార్జీలు కూడా అతనే భరాయించాడు.

వచ్చేటప్పుడు చివరిసారిగా పుట్టి పెరిగిన ఊరికీ, ఋణానుబంధం తీరిపోయిన ఇంటికీ వీడ్కోలు చెప్పి బయల్దేరాను.

నెల నెలా వచ్చే పెన్షన్ డబ్బుల్లోంచి యాభయ్యో వందో చేతి ఖర్చుకు ఉంచుకొని మిగతా డబ్బు చెరిసగమూ ఇవ్వడం మొదలెట్టాను. కానీ ఆ పద్ధతి తప్పని ఒకనాడు రమ్య ఎవరితోనో అంటూండగా విన్నాను.

"డబ్బులు మాత్రం లెఖ్ఖబెట్టి చెరిసగమూ ఇస్తున్నారు. కానీ ఏం లాభం? నెలకు ఇరవై రోజులూ ఇక్కడే మకాము. ఇప్పటికే ఇల్లు కట్టి పీకల్దాకా అప్పుల్లో మునిగిపోయాము. రెండు గదులు అద్దెకిస్తేనైనా కాస్త హెల్ప్‌ఫుల్‌గా ఉంటుందనుకుంటుంటే ఇప్పుడిక అది కూడా కుదిరేట్టు లేదు..."

మర్నాడే చిన్నాడి దగ్గరకు బయల్దేరాను... ఓ సూట్‌కేసులో బట్టలు సర్దుకుని!

"ఈ రెండు గదుల కొంపకే ఆరొందలు అద్దె కడుతున్నాను నాన్నా! ఇక మీరూ ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నారు కాబట్టి కాస్త పెద్దింటి కోసమే ట్రై చెయ్యాలి. కానీ అద్దె ఎంత లేదన్నా వెయ్యి రూపాయలకు పైనే అవుతుంది..." అన్నాడు చిన్నాడు.

"ఈ బాధలన్నింటికన్నా.... మీరు కొన్నాళ్ళు బావగారిదగ్గరుంటేనే కాస్త సౌకర్యంగా ఉంటుందేమో మామయ్యా..." అన్నది చిన్న కోడలు.

"అవునమ్మా నేనూ అదే అనుకుంటున్నానని" చెప్పి మర్నాడే పెద్దోడి దగ్గరికి బయల్దేరాను.

"బాబాయ్ దగ్గరే ఉంటానని వెళ్ళిపోయారుగా తాతయ్యా? మళ్ళీ ఎందుకు వచ్చారు?" పిల్లలిద్దరూ నిష్ఠూరమాడారు నేను ఇంట్లో అడుగు పెట్టగానే.

"నా మడత మంచమూ, బట్టలూ, పాత్రలూ అన్నీ ఇక్కడే ఉన్నాయ్‌గా నాన్నా! అవి తీసుకెళ్ళడానికే వచ్చాను. మరి నేను ఈ సాయంత్రానికే ఊరెళ్ళిపోవాలిగా. అందుకనే మళ్ళీ వచ్చానన్నమాట..." పిల్లలిద్దర్నీ దగ్గరకు తీసుకుని ముద్దులు పెడుతూ అన్నాను.

"మరి మాతో అబద్ధం ఎందుకు చెప్పావ్ తాతయ్యా... ఇంక ఎక్కడికీ వెళ్ళను ఇక్కడే ఉంటానని?" ఆశ్చర్యంగా అడిగారు వాళ్ళు...

"అతిథిగా వచ్చిన వాళ్ళు ఎక్కువ రోజులు ఉండగూడదని నాకప్పుడు తెలీదు నాన్నా! అందుకే మీతో అలా చెప్పాను... సారీ..."

నా మాటలు వాళ్ళకు అర్థమైనట్టు లేదు!

అర్థం అయిన వాళ్ళకు హృదయం లేదు!! ●